క్లుప్తంగా

70 మందికిపైగా వైద్య పరీక్షలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రకాష్ చవల

ఒంగోలు అర్బన్: స్థానిక ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో హాస్పిటల్ సహకారంతో లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు, లయన్స్ క్లబ్ ఆఫ్ విజన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా రక్త నాళాల (వెరికోస్ వీన్స్) వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని లయన్స్ క్లబ్ ప్రతినిధులతో పాటు ఉపాస్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చవల ప్రారంభించారు. వెరికోస్ వీన్స్ వైద్యులు డాక్టర్ సురేష్‌రెడ్డి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో సుమారు 70 మందికిపైగా వైద్య పరీక్షలు చేయించుకున్నారని నిర్వాహకులు తెలిపారు. డాక్టర్లు ఉమాపతి చౌదరి, అనపర్తి శ్రీనివాసులు, అనిల్‌కుమార్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు, ఒంగోలు విజన్ సభ్యులు రచన, ఎస్.శివశంకర్, ఎం.రామకృష్ణ, యు.మారుతి, ఏ శ్రీనివాసరావు, ఎస్. సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష, కేజీబీవీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- వేడుకోలు దీక్ష నిర్వహించిన ఉద్యోగులు

ఒంగోలు అర్బన్: సమగ్ర శిక్ష, కేజీబీవీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం ప్రకాశం భవనం వద్ద ఉద్యోగులు వేడుకోలు దీక్ష నిర్వహించారు. దీనిలో ఆర్ట్ క్రాఫ్ట్ పీఈటీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కళ్యాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో ఉద్యోగుల సమస్యలు తీరుస్తామని ఇచ్చిన మాట మేరకు పరిష్కరించాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని కోరారు. ఉద్యోగుల వేతనాలు సకాలంలో చెల్లించాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేసి పనిభారం తగ్గించాలని విన్నవించారు. వేతనంతో కూడి మెడికల్ సెలవులు మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నీ సంక్షేమ పథకాలు తమకు వర్తింపచేయాలని, వడ్డీ లేని రుణాలు అందచేయాలని కోరారు. వీటితో పాటు ఉద్యోగులు తెలిపిన అన్నీ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. దీనిలో సంఘం నాయకులు వినయ్, సాయి, శ్రీదేవి, మధు, వీరాంజనేయులు పాల్గొన్నారు

వైద్యుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న డాక్టర్ రవికృష్ణ

గిద్దలూరు రూరల్: వైద్యుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.రవికృష్ణ కోరారు. పట్టణంలోని వీఆర్ గ్రాండ్ హోటల్ ప్రాంగణంలో ఐఎంఏ గిద్దలూరు శాఖ ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్రంలో 98వ శాఖను గిద్దలూరులో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఇటీవల కాలంలో వైద్యశాలలపై దాడులు, వైద్యులపై భౌతిక దాడులు జరుగుతున్నాయని వాటిని నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను తీసుకురావాలన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వైద్యులు, వైద్యశాలలపై దాడుల నిరోధకానికి చట్టం తీసుకువచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో గిద్దలూరు ఐఎంఏ శాఖ అధ్యక్షుడు డాక్టర్ కిషోర్, కార్యదర్శి డాక్టర్ హరినాథ్‌రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జయశేఖర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, ఒంగోలు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ జాలాది మణిబాబు, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

యాదవుల అభ్యున్నతికి సహకారం

- ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి
- శ్రీకృష్ణుడికి పూజలు



శ్రీకృష్ణుడికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు మెట్రో: యాదవుల అభ్యున్నతికి తన వంతు పూర్తి సహాయ సహకారాలను ఎల్లవేళలా అందిస్తానని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని శ్రీకృష్ణ ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు కుట్టుబోయిన కోటియాదవ్ ఆధ్వర్యంలో ఒంగోలులోని అంకమ్మపాలెంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో బాలినేని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యాదవులు ఘనంగా స్వాగతం పలకగా, శ్రీకృష్ణ పరమాత్మునికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో బాలినేని పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కృష్ణాష్టమి పండుగను పురస్కరించుకుని పేద విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేయడం గొప్ప కార్యక్రమం అని అన్నారు. కృష్ణ భగవాన్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులైన శ్రీకృష్ణ ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులను ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర నాయకుడు కటారి శంకర్, తుమ్మకురి దొర, కార్పొరేటర్ యనమల నాగరాజు, ధనలక్ష్మి, హరి, వెంకటేశ్వర్లు, మిరియం రవి, సురేష్, చిన్ని, అనిల్, బంకా చిరంజీవి, దుర్గాప్రసాద్, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

'గడపగడపకు' ఎంతో సంతృప్తినిచ్చింది

- సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు
- విజయవంతంగా ముగిసిన గడపగడపకు మన ప్రభుత్వం
- 2022 మే 13న ప్రారంభమైన వైనం
- 16 నెలల్లో 84 సచివాలయాల్లో 91 వేల గడపల సందర్శన



మహిళలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో నియోజకవర్గంలో 2022 మే 13న నాగులుప్పలపాడు మండలం తిమ్మసముద్రంలో ప్రారంభించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం సంతనూతలపాడులో విజయవంతంగా ముగిసింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 84 సచివాలయాల పరిధిలో 91 వేల గడపలను ఎమ్మెల్యే టీజేఆర్ సందర్శించారు. దాదాపు 16 నెలల పాటు నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆయన సందర్శించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి స్వయంగా ప్రజలనడిగి తెలుసుకున్నారు. చివరిగా ఆదివారం సంతనూతలపాడు నియోజకవర్గ కేంద్రంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించి హర్షం వ్యక్తం చేశారు. తనకు సహకరించిన ప్రజలు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. చివరిరోజు ఆదివారం సంతనూతలపాడులోని ఎస్టీకాలనీ, క్రిష్టియన్‌పాలెం, జెండాచెట్టు ప్రాంతాల్లో మొత్తం 850 ఇళ్లను సందర్శించారు. పార్టీ జెండాలు చేతబట్టి డప్పు వాయిద్యాలతో ఎమ్మెల్యేకు పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికి తిరిగి సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందిస్తూ ఏయే ఇంట్లో ఏయే పథకాలను ప్రభుత్వం అందించిందో తెలుసుకున్నారు. పార్టీలకతీతంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా గ్రామాల్లో కోట్లాది రూపాయల విలువ చేసే అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లోనూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా ఆదరించి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ గడిచిన మూడు రోజులుగా నిర్వహించిన గడప గడప కార్యక్రమానికి అండగా నిలిచి ఎమ్మెల్యే టీజేఆర్‌కు అపూర్వస్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇనగంటి పిచ్చిరెడ్డి, నాలుగు మండలాల పార్టీ కన్వీనర్లు దుంపా చెంచిరెడ్డి, మండవ అప్పారావు, పమిడి వెంకటేశ్వర్లు, పోలవరపు శ్రీమన్నారాయణ, కొలకలూరి విజయ్‌కుమార్, చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, కొమ్మూరి సుధాకర్, దుంపా యలమందారెడ్డి, వైస్ ఎంపీపీ టీ రాగమ్మ, ఎంపీటీసీ బాపట్ల సుబ్బారావు, సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి, పలు గ్రామాల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతోనే బంగారు భవిష్యత్తు

- ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు అనిలకుమారి



ప్రైవేటు ఉపాధ్యాయులను సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఒంగోలు టౌన్: దేశ ఉజ్వల భవిష్యత్తు ఉపాధ్యాయులపైనే ఆధారపడి ఉంటుందని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ కుదుముల అనిలకుమారి అన్నారు. స్థానిక మల్లయ్య లింగం భవనంలో అసోసియేషన్ ఆఫ్ ప్రైవేటు లెక్చరర్స్ అండ్ టీచర్స్, ఆంధ్రప్రదేశ్ విద్యావంతుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఆదివారం సత్కార సభ నిర్వహించారు. జేకే ఒకేషనల్ కాలేజీ కరస్పాండెంట్ అనపర్తి కిషోర్ అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ అనిల మాట్లాడుతూ మనిషి జన్మకు వన్నె తెచ్చేది ఉపాధ్యాయ వృత్తి అని, ఒక ఉపాధ్యాయుడు తన జీవిత కాలంలో వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దే అవకాశం ఉందని అన్నారు. భూమి మీద నడిచే దైవంలా అశేష ప్రజల చేత గౌరవించబడుతున్న ఉపాధ్యాయులను సత్కరించడం మంచి పరిణామమని అన్నారు. గురువును బ్రహ్మతో పోల్చారని, అన్ని సేవల్లోకెల్లా విద్యాసేవ చాలా గొప్పదని చెప్పారు. అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు సాల్మన్ నల్లగట్ల సభకు స్వాగతం పలకగా ముఖ్య అతిథులుగా పీఏన్‌సీఏ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ గీతారాణి, ప్రముఖ వైద్యులు చాపల వంశీకృష్ణ, తాటిపర్తి గోపాలరెడ్డి, ఏబీఎం విశ్రాంత ప్రిన్సిపాల్ టీఎస్ఎస్ సింగ్ పాల్గొని ప్రైవేటు విద్యాసంస్థల ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. సభలో పలువురు విద్యావేత్తలు కుమ్మరకుంట సురేష్, డి.నాగేశ్వరరావు, దిగ్విజయ్, నూరుద్దీన్, దారా మోహన్‌రావు, కరిముల్లా, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చందూ డ్యాన్స్ అకాడమీ చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ముగిసిన టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీలు



విజేతలకు ట్రోఫీ, నగదు బహుమతులు అందిస్తున్న మారం వెంకారెడ్డి

ఒంగోలు: స్థానిక మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఏపీ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు వేడుకకు ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ పరిశీలకుడు, మద్దిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి హాజరయ్యారు. మూడు రోజులపాటు నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను ఆయన అభినందించారు. మంచి ర్యాంకింగ్స్ తెచ్చుకుంటూ రాష్ట్రస్థాయి పోటీల్లోనే కాకుండా జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి పాల్గొన్న క్రీడాకారులకు ట్రోఫీతో పాటు నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ ఎస్.కిషోర్‌కుమార్, జిల్లా అధ్యక్షురాలు పి.ప్రియ, జిల్లా కార్యదర్శి హాజీరాబేగం, ఉపాధ్యక్షులు కె.రవి, కె.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల నిర్మాణం నాణ్యతలో రాజీపడొద్దు

- రాష్ట్ర పంచాయితీరాజ్ సీఈ బాలునాయక్

మార్కాపురం రూరల్: నూతనంగా నిర్మిస్తున్న గ్రామ సచివాలయ భవనాల నాణ్యతలో ఎక్కడా రాజీపడొద్దని రాష్ట్ర పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీర్ బి.బాలునాయక్ సూచించారు. ఆదివారం మండలంలోని వేములకోట, తిప్పాయిపాలెం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సచివాలయాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవనాల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. త్వరితగతిన సచివాలయాలను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకునిరావాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయితీరాజ్ ఈఈ వై.రమేష్‌బాబు, డీఈ కె.ఆదినారాయణ, ఏఈ విజయమోహన్‌రాజు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

వానలు కురవాలి తల్లీ



ప్రత్యేక పూజలు అందుకుంటున్న పోలేరమ్మ దేవత

పుల్లలచెరువు: వానలు కురిసి పంటలు బాగా పండాలి తల్లీ అంటూ పుల్లలచెరువు లో గ్రామస్తులు గ్రామ దేవత పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో వచ్చే చివరి ఆదివారం గ్రామాల్లో గ్రామదేవతలకు నీళ్లు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించే ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా భక్తులు ఉదయం నుంచి ఉపవాసాలు ఉండి గ్రామ దేవత పోలేరమ్మకు బోనాలు సమర్పించారు.

శిద్దా సుధీర్‌కు బ్రాహ్మణ సేవా సమితి సత్కారం



శిద్దా సుధీర్‌కుమార్‌ను సత్కరిస్తున్న బ్రాహ్మణ సేవా సమితి ప్రతినిధులు

ఒంగోలు: టీటీడీ పాలకమండలి సభ్యుడు శిద్దా సుధీర్‌కుమార్‌ను ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ప్రతినిధులు ఆదివారం ఆయన నివాసంలో కలుసుకుని సత్కరించారు. మద్దులూరి హరిప్రేమనాథ్, గంజాం శ్రీరంగనాథ ప్రసాద్, మహంకాళి వెంకట శేషయ్య, మైనంపాటి సాయి, ముక్తినూతలపాటి శ్రీనివాసు, పింగళి పూర్ణచంద్రరావు, అనఘా ఝాన్సీలక్ష్మి, అనఘా వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

మద్దిపాడు: వినాయక చవితి సందర్భంగా విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఈ నెల 18వ తేదీ వినాయక చవితి సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేసే కమిటీ సభ్యులు ముందుగా మైక్ పర్మిషన్ తీసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో ప్రైవేటు స్థలాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని, రహదారులపై అడ్డంగా ఏర్పాటు చేయరాదని అన్నారు. అదేవిధంగా మైకులు ఏర్పాటు చేసే క్రమంలో చుట్టుపక్కల వారికి ఇబ్బందులు లేకుండా తక్కువ సౌండ్ పెట్టుకోవాలన్నారు. కమిటీ సభ్యులు తప్పనిసరిగా విగ్రహాల వద్ద ఉండాలని, పోలీసులు అడిగిన క్రమంలో వారు అనుమతి పత్రాలు చూపాలని తెలిపారు. నిమజ్జన సమయంలో విగ్రహాలను గుండ్లకమ్మ రిజర్వాయర్ లోపలి వైపు వేయరాదన్నారు. విగ్రహాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు పోలీసుల అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు. విగ్రహాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా ఐదుగురు కమిటీ సభ్యులతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగవని హామీ ఇస్తూ డిక్లరేషన్ ఇవ్వాలన్నారు. వినాయక విగ్రహాల నిమజ్జనాలు ఏ ప్రాంతంలో ఏ రోజు నిర్వహిస్తారో కూడా పోలీసులకు ముందుగానే తెలియజేయాలని, నిమజ్జనం సమయంలో ఎటువంటి అల్లర్లు జరిగినా కమిటీ సభ్యులదే బాధ్యతని ఎస్సై పేర్కొన్నారు.

ప్రజాకళారంగంలో గద్దర్‌ది చెరిగిపోని అధ్యాయం

- ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు



శరత్‌బాబును సన్మానిస్తున్న నల్లూరి వెంకటేశ్వర్లు, తదితరులు

ఒంగోలు మెట్రో: ప్రజాకళారంగంలో గద్దర్‌ది చెరిగిపోని అధ్యాయమని ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు అన్నారు. గద్దర్‌పై ప్రజాగాయకుడు నూకతోటి శరత్‌బాబు రూపొందించిన ప్రత్యేక గీతాన్ని ఒంగోలు ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గద్దర్ జీవితం నిరంతరం పోరాటమేనని, ప్రజా సమస్యలపై పదునైన భావజాలంతో ఎన్నో పాటలు రచించి సమాజ చైతన్యానికి పాటుపడ్డారని కొనియాడారు. అటువంటి ప్రజా గాయకుడు మరణించడం ప్రజా కళారంగానికి పూడ్చలేని లోటని అన్నారు. గద్దర్‌పై ప్రత్యేక గీతాన్ని గాయకుడు నూకతోటి శరత్‌బాబు రచించడం అభినందనీయమన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి చుండూరి రవిబాబు మాట్లాడుతూ కమ్యూనిస్టుగా గద్దర్ తన పాటల ద్వారా సమసమాజ మేలు కోరుకున్నారని, కానీ, కమ్యూనిస్టుల అతి విశ్వాసం వల్లే ఈరోజు పాలనకు దూరమయ్యారని అన్నారు తన చిన్నతనంలో ఎర్రజెండా అంటే ఓ ప్రత్యేకమైన అభిమానం ఉండేదన్నారు. రానురాను కమ్యూనిస్టు పార్టీలు చీలికలు పేలికలు అయ్యాయని, కానీ కమ్యూనిజం గొప్పదని పేర్కొన్నారు. అటువంటి కమ్యూనిజం పాటలు సమాజహితం కోరాయని, గద్దర్ మరణించడం తీరని లోటని అన్నారు. గద్దర్‌పై శరత్‌బాబు రూపొందించిన ప్రత్యేక గీతానికి సంగీతం, సాహిత్యం సమకూర్చిన సింహాద్రి జ్యోతిర్మయి ఖాసీంలను ఆయన అభినందించారు. కళామిత్రమండలి అధ్యక్షుడు నూనె అంకమ్మరావు సభకు అధ్యక్షత వహించగా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ప్రముఖ కాంట్రాక్టర్ మండవ మురళీకృష్ణ, నవ్యాంధ్ర రచయితల సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ, నాగభైరవ కళా పీఠం అధ్యక్షుడు నాగభైరవ ఆదినారాయణ, డాక్టర్ చాపల వంశీకృష్ణ, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు జాలాది మణిబాబు, సంగీత దర్శకులు ఖాసీమ్, ఏజే సొల్యూషన్ ప్రియా, మారెళ్ల సుబ్బారావు, కొల్లా మధు, ఎడిటర్ షాన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం శరత్‌బాబును సన్మానించారు. చందు డ్యాన్స్ అకాడమీ చిన్నారులు గద్దర్ పాటలకు చక్కగా నృత్యం చేశారు.

క్రీడాకారులు సామాజిక బాధ్యత కలిగి ఉండాలి



ఏపీ మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా ఎంపికైన ఆరికట్ల సుమతిని సత్కరిస్తున్న క్రీడాప్రతినిధులు

- మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు

ఒంగోలు: మాస్టర్ అథ్లెటిక్స్ క్రీడాకారులు సామాజిక బాధ్యత కలిగి ఉండాలని మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు పేర్కొన్నారు. స్థానిక హోటల్ మౌర్యా ఇన్‌లో ఆదివారం నిర్వహించిన మాస్టర్ అథ్లెటిక్స్ రాష్ట్ర సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈదర హరిబాబు మాట్లాడుతూ 30 సంవత్సరాల వయస్సు దాటిన వారు అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనేందుకు ముందుకు రావడం హర్షించాల్సిన అంశం అన్నారు. ప్రపంచ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న సైకం రామ్ ప్రసాద్, ట్రెక్కింగ్ కింగ్ కె.రాజశిఖామణి వంటి వారు మాస్టర్ అథ్లెటిక్స్ క్రీడాకారులకు ఒక రోల్ మోడల్ అన్నారు. సుమతి క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ఆర్థిక అండదండలు అందిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ క్రీడాకారులు తాము నివాసం ఉండే ప్రాంతంలో వృద్ధుల కోసం ఫిజియోథెరపీ క్యాంపులు వంటివి ఏర్పాటుచేస్తూ సామాజిక బాధ్యత దిశగా అడుగులు వేసి ఆదర్శంగా నిలవాలని సూచించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సైకం రామ్ ప్రసాద్ మాట్లాడుతూ డిసెంబర్ 8, 9, 10 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలను తిరుపతిలోని వెంకటేశ్వర విశ్వవిద్యాలయం స్టేడియంలో నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ కె.రాజశిఖామణి మాట్లాడుతూ క్రీడలతో మానసిక సమస్యలు దూరం అవుతాయన్నారు. క్రమశిక్షణగా మెలుగుతూ కనీసం 90 రోజులపాటు నిరంతర సాధనతో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. రాష్ట్ర అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన ఆరికట్ల సుమతి మాట్లాడుతూ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన తాను బాలికలు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షురాలు వనజ, ఏపీ మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి పి.శివశంకర్, 47వ డివిజన్ కార్పొరేటర్ అశ్విని తదితరులు పాల్గొన్నారు. అనంతరం సుమతిని ఘనంగా సత్కరించారు.

స్నేహం.. 'అపూర్వ'ం



పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మార్కాపురం టౌన్: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 2003–04లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో అపూర్వంగా సాగింది. పూర్వ విద్యార్థుల్లో పలువురు ఉద్యోగులు, వ్యాపారవేత్తలుగా స్థిరపడ్డారు. ఆనాటి జ్ఞాపకాలను, ఉపాధ్యాయులతో గడిపిన రోజులను గుర్తుచేసుకున్నారు. చదవు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు టీచర్లుగా, సాఫ్ట్వేర్, రెవెన్యూ ఉద్యోగులుగా జీవితంలో స్థిరపడటం అభినందనీయమని రిటైర్డు డీవైఈఓ సీహెచ్‌పీ వెంకటరెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు టి.శ్రీనివాసులు, హెచ్ఎంలు సుధాకర్, కృష్ణారెడ్డి, మల్లికార్జునరావు, ఎం.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ సిల్వర్ జూబ్లీ వార్షికోత్సవం



108 కలశాలతో నగరోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

పెద్దదోర్నాల: వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ సిల్వర్ జూబ్లీ వార్షికోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకలను పురస్కరించుకుని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌ను పసిడి, రజిత ఆభరణాలు, పూలమాలలతో అలంకరించారు. ఆలయ అర్చకులు బిదరె రాంప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున 5 గంటలకు అమ్మవారికి సుప్రభాతసేవ, క్షీరాభిషేకం, సహస్ర నామార్చనలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. మహిళా భక్తులచే అమ్మవారికి లలితా సహస్రనామ పారాయణం, మహా మంగళ హారతి, వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 108 కలశాలతో నగరోత్సవం నిర్వహించారు.